# "అంతా కులాసాయేనా?"

ఉదయం తొమ్మిది గంటలైంది

రోడ్లన్నీ రద్దీగా వున్నాయి సుధారాణి చేతిలో పుస్తకం పట్టుకొని నెమ్మదిగా నడుస్తూంది. రోడ్డు వైపుగా ఎడమ ప్రక్కనున్న ఇంటి లోనికెళ్ళి 'అంతా కులాసాయేనా?' అంది.

'ఆ, ఆ' లోపలినుండి జవాబు వినిపించింది. గోడమీద పెన్సిల్‌తో గుండ్రంగా గీచి, తారీకు వేసి సంతకం పెట్టింది మలేరియా డిపార్టుమెంటమ్మాయి సుధారాణి.

వంటు ఇంటి తలుపులు చటుక్కున తెరుచుకొన్నాయి. ఇంటావిడ కళ్ళు గోడమీద పడ్డాయి. 'ఆ అ, అదేం పని, అయ్. వెయ్యి రూపాయలు ఖర్చుపెట్టి సున్నాలు రంగులు వేయించాను. గోడంతా పాడుచేస్తావా? ఏం పోయేకాలం? దొరక్క దొరక్క మా గోడే దొరికిందా? ఇదివరకు గోడమీద గీచింది నువ్వేనా? కనపడకుండా చక్కాపోయావ్? ఈసారి గోడమీద చెయ్యేశావంటే జాగ్రత్త' అని హెచ్చరిక చేసింది.

'అదికాదండీ...'

'పో అవతలకు. తగుదునమ్మాయని నీబోటి అడకూతురు ఉద్యోగం వెలగబెట్టగానే సరా? ఫో వెళ్ళు వెళ్ళు, బుద్ధిగా ఉండు' అని తలుపు భళ్ళున మూసివేసింది. సుధారాణికి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

అందరాడపిల్లల్లాగా ఆమె ఉద్యోగం చేస్తోంది. కాని ఆఫీసుల్లో అమ్మాయిలకున్న గౌరవం మలేరియా డిపార్ట్‌మెంట్ లేడీస్‌కి లేదు. ఎవరేమనుకున్నా పరవాలేదు. తన ఉద్యోగధర్మం, ఇంటింటికెళ్ళాలి. ఏమైనా అంటే విని ఊరుకోవాలిఅనుకుంది. తనలో తనే ధైర్యం చెప్పుకుంది.

ఆమె వెనుక ఎవరో నలుగురు కొంటె కుర్రాళ్లు నడుస్తున్నారు. అందులో వొకడు 'హల్లో ఎన్నాళ్ళకెన్నాళ్ళకు' అన్నాడు. తన స్నేహితుడిని అడిగినట్టుగా.

'ఈవూరు వచ్చి రెండురోజులైంది. ఏదో బిజీగా ఉండి రాలేకపోయామురా, సారీ'

'అన్నట్టు నీ పేరు మరచిపోయామురా, సుధాకర్ గదూ' అన్నాడు వెక్కిరింపుగా.

'అవును, అంతా సుధా అంటారు'

---

*రెండవ బహుమతి రూ. 25*

యం. సాయోజీరావు

సెకండ్ బి. యస్ సి. ఆంధ్రా లయోలా కాలేజీ, విజయవాడ.

'సుధా! మనది ఏ డిపార్టు మెంటు?'

'మలేరియా.'

సుధారాణి ఈ మాటలన్నీ విని కోపంగా చూసింది ఆ కొంటె కుర్రాడి వైపు.

'సారీ. వస్తానురా బై బై' అని చేతులు తిప్పుకొంటూ వెళ్ళిపోయాడు.

• • •

'బాబాయి! పిన్నమ్ముందా' లోపల అడుగుపెడుతూ అడిగింది సుధారాణి -

'ఎవరు? ఓహో సుధా, రామ్మా, రా, సుధమ్మా. ఒసేయ్ నిన్నే మీ అమ్మాయి వచ్చింది. రావేం' అన్నారు అవధానిగారు.

'వచ్చే. పప్పు తాలింపు అయిపోవచ్చింది. ఒక్క పావుగంట చాలు, అమ్మాయిని కూర్చోబెట్టండి' అని లోపలనుండి జవాబు స్పష్టంగా వినిపించింది.

'అంతా కులాసాయేనా? బాబాయ్.'

'దేవుని దయవల్ల చల్లగా ఉన్నాం తల్లీ' అన్నారు యథాప్రకారంగా గోడమీద గీచి సంతకం పెట్టింది. 'పిన్నమ్మా, లోపల ఏం కూరలు చేస్తున్నా'వని ఆమె లోపలకు పోబోయింది. ఇంతలో అవధానులుగారు 'అమ్మాయి సుధా; లోపలకు పోబోకు. మీ పిన్నమ్మ మడితో వుంది' అన్నారు.

మనసు చివుక్కుమంది. ఇంకా ఎక్కువసేపున్నా గౌరవంగా వుండదని మనసులో తలచి 'వస్తాను



బాబాయ్ పిన్నమ్మతో చెప్పు' అని గబగబా మెట్లు దిగి వెళ్ళిపోయింది.

'ఏమండీ! అమ్మాయ్ ఏది?'

'లేదు వెళ్ళిపోయింది. ఆఫీస్ పనిమీదొచ్చింది. ఆగమంటే ఆగలేదు.'

● ● ●

మధ్యాహ్నం సుధారాణి నవల చదువుతున్నది. ప్రక్కింటి అనసూయమ్మగారు ఏదో మాట్లాడుతోంది తల్లితో. సుధారాణి చెవి ఒగ్గి మాటలు వింటోంది.

'ఒదినా అమ్మాయికి సంబంధం కుదిరిందా?'

'లేదు.'

'ఈడొచ్చిన పిల్లకు మంచి సంబంధం చూసి ముడిపెడ్తే బాగుంటుంది. ఎందుకొచ్చిన ఉద్యోగాలు, ఏం సుఖం? పాపం. సుధమ్మను చూస్తే జాలేస్తుంది. ఎక్కే గుమ్మం, దిగే గుమ్మం' అంది ఆవిడ.

'అమ్మాయికప్పుడే పెళ్ళి చేయ' మని ఖచ్చితంగా అమ్మ గొంతు వినిపించింది.

'ఏమనుకోకండీ ఒదినగారూ! సుధమ్మ మన పిల్లేగాయని అన్నాను' అంటూ ఆవిడ వెళ్ళిపోయింది.

ఇంతలో సుధ లేచి 'అమ్మా! ఏమిటి అత్తయ్యంటుంది?'

'లేం లేదు.'

'అంతా విన్నానులే. నన్నెందుకంతా విమర్శిస్తారు. మొన్న సినిమాకు వెళ్ళితే అక్కడ గూడా అంతా మలేరియా డిపార్టుమెంటని వెక్కిరించారు. రోడ్డుమీద ఇహ చెప్పక్కర్లేదు. మొన్న పిన్నమ్మింటికి వెళితే బాబాయి నన్ను లోనికి వెళ్ళనివ్వలేదు. ఏమయినా సరే నే నుద్యోగం చేయలేను. ఉద్యోగానికి రాజీనామా చేస్తా'నంది రోషంగా.

అటుగా వస్తున్న అన్నయ్య ఆమాటలువిని,'చెల్లెమ్మా! నీయిష్టం లేని పని ఎన్నడూ చేయద్దు' అన్నాడు. అన్నయ్యమాటలు ఆమెకెంతో ధైర్యానిచ్చాయి.

అది వర్షాకాలం జూన్ నెల. ఉద్యోగానికి రాజీనామా యిచ్చి కాలేజీలో చేరిది సుధారాణి. ఇంటింటికి తిరిగి అందరారోగ్యం విచారించటం కంటె కాలేజీలో చదవటం సంతోషంగా ఉంది. అలా వారం రోజులు గడచినవై కాలేజీ తెరచి. సుధారాణి కాలేజినుంచి ఇంటికి బయలు దేరింది. హాల్లో అంతా కులాసాయేనా? అన్న మాటలు వినిపించినాయి. సుధారాణి వెనుతిరిగి చూచింది. నలుగురు కుర్రాళ్లు పకపకానవ్వుతున్నారు.

తను ఉద్యోగం మానివేసినా 'అంతా కులాసాయేనా' అన్న మాటలు మాత్రం పోలేదు.

□□□